క్లుప్తంగా

యువత పోరుకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే యువత పోరు నిరసన కార్యక్రమానికి నిరుద్యోగులు, విద్యార్థులు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తానని చెప్పి అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులకు చంద్రబాబు అన్యాయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మెడలు వంచి నిరుద్యోగులకు న్యాయం చేయడానికి పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ యువత పోరు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


ఉపాధి హామీ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

అగళి: మండలంలో ఉపాధి హామీ కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారులను ఉద్యోగులు సన్మానించారు. ఆదివారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ శివన్న , జేఈ శ్రీధర, టీఏ వెంకటప్ప, ఈరన్నలను ఉపాధి సిబ్బంది సత్కరించారు. ఏపీఓ మంజునాథ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన హిందూపురం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, పలువురు మైనార్టీలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని జామియా మసీదు మాజీ ముతవల్లి కలీముల్లా .. వేణురెడ్డిని ఆహ్వానించారు.

ఆలయంలో దొంగతనం


హుండీని ధ్వంసం చేసిన దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామ సమీపంలోని అప్పాజిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వెలసిన వీరచిన్నయ్యస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలోని కానుకలను శనివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో రూ .10 వేల నుంచి రూ. 20 వేలు ఉండవచ్చన్నారు. దుండగులు ముఖాలకు ముసుగులు ధరించి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయిందన్నారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాగు పట్టాలు పంపిణీ చేయాలి

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 384కు సంబంధించి భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఇంటిపట్టాలు కూడా మంజూరు చేయాలని సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, కిష్టప్ప, స్వర్ణలత, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

విరిగి పడిన విద్యుత్ స్తంభం


సానిపల్లిలో గాలి ధాటికి విరిగి పడిన విద్యుత్ స్తంభం

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లిలో ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. ఒక్కసారి పెద్ద ఎత్తున గాలులు వీచడంతో పెద్ద వేపమాను చెట్టు కూడా పడిపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు.


చిత్రంలోని మహిళ పేరు భాగ్యమ్మ. రొళ్ల మండలం టీడీ పల్లి. ఈమె భర్త రమేష్‌బాబుతో పాటు అత్తమామలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొదటి కుమార్తె శాలిని 7వ తరగతి, రెండో కుమార్తె శ్రేయా 6వ తరగతి, కుమారుడు మోరియా 3వ తరగతి చదువుతున్నారు. వీరికి అన్ని అర్హతలు ఉన్న కూడా ఇప్పటి వరకూ తల్లికి వందనం కింద పైసా కూడా బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. సర్టిఫికెట్లు తీసుకుని సచివాలయం చుట్టూ తిరిగినా కూడా అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని భాగ్యమ్మ వాపోతోంది.


చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థిని పేరు రంజిత. మడకశిర పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. అయితే ఈవిద్యార్థినికి తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలు తన తల్లి ఖాతాలో జమ కాలేదు. అర్హుల జాబితాలో పేరున్నా నగదు మాత్రం పడలేదు. అయితే ఈవిద్యార్థిని తమ్ముళ్లు హరీష్ 7వ తరగతి, హేమంత్ 9వ తరగతి చదువుతున్నారు. వారికి మాత్రం తల్లికి వందనం నిధులు జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్ వరకూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం నిధులు జమ చేస్తామని చెప్పినా కూడా ఈ నిధులు పూర్తి స్థాయిలో విద్యార్థులకు జమ కాలేదు. దీంతో తల్లికి వందనం నిధులు జమ కాని కుటుంబాల్లో ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తమవుతోంది.


చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు అర్చన, మడకశిర మండల పరిధిలోని చందకచెర్లు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అయితే ఇప్పటి వరకూ తల్లికి వందనం నగదు విద్యార్థిని తల్లి బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదు. గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి అడిగితే అర్హుల జాబితాలో ఉందని నగదు బ్యాంకు ఖాతాలోకి పడుతుందని చెబుతున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు తల్లికి వందనం నగదు ఎప్పుడు ఖాతాలోకి జమ అవుతోందని ఎదురు చూస్తున్నారు.


చిత్రంలో కనిపిస్తున్న వారి పేర్లు బేబిశ్యామల, ఆమె కుమార్తె తనుశ్రీ. వీరిది లేపాక్షి మండలం మైదుగోళం గ్రామం. బేబిశ్యామల భర్త గోవిందప్ప బేల్దారి వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలో ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తుపాస్తులు లేవు. బేల్దార్ పనికి పోతే తప్ప పూట గడవడం కష్టంగా ఉంటుంది. కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుమార్తె తనుశ్రీ స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నారు. అయితే తల్లికి వందనం డబ్బులు రూ.13 వేలు కచ్చితంగా పడతాయని ఆ దంపతులు భావించారు. అయితే నేటికీ డబ్బులు జమకాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి విచారించిన ఈరోజు, రేపు అని సమాధానం చెబుతున్నారే తప్ప తమ ఖాతాల్లోకి జమ కాలేదని బేబిశ్యామల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు శ్యామల. సోమందేపల్లి మండలం పోలేపల్లి. ఆమె కుమారుడు ప్రవీణ్ కుమార్ 9వ తరగతి, అఖిల 4వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరికి 24 ఎకరాలు భూమి ఉందని చెప్పి తల్లికి వందనం పథకం అనర్హుల జాబితాలో చేర్చారు. తమకు ఉన్నది 3 ఎకరాల భూమి మాత్రమేనని, పథకం రాకుండా చేయడం బాధాకరమని శ్యామల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లికి వంచన



- నిబంధనల పేరుతో తల్లికి వందనం పథకం వర్తించకుండా కొర్రీలు
- నగం మంది విద్యార్థులు పథకానికి దూరం
- నమ్మించి మోసం చేశారని మహిళల ఆవేదన

ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే అరకొర నిధులు విడుదల చేయడంతో చాలా మంది తల్లులకు నిరాశే మిగిలింది. నిబంధనల పేరుతో అర్ధానికి అర్ధం మందిని పథకానికి దూరం చేశారు. దీనికి తోడు తప్పుడు డేటా కారణంగా ఎంతో మందికి డబ్బులు జమకాలేదు. భూమి లేకున్నా ఉన్నట్లు, ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు, అధిక యూనిట్లు వాడినట్లు, ఫోర్ వీలర్ ఉన్నట్లు జాబితాలో రావడంతో చాలా మంది డబ్బులు జమకాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అంగన్వాడీలు, స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయకపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. మొత్తానికి తల్లికి వందనం అంటూ వంచించారని అమ్మలందరూ కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. – సాక్షిబృందం


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నల్లూరు గ్రామ రైతులు (ఫైల్)

32 మంది విద్యార్థులకు అన్యాయం

రొద్దం మండల పరిధిలోని నల్లూరులో 32 మంది విద్యార్థులకు తల్లికి వందనం అందలేదని గ్రామస్తులు తెలిపారు. సర్వేనంబర్ 480లో 44 ఎకరాలు 30 రైతులకు ఒక్కో రైతుకు 44 ఎకరాలు ఆన్‌లైన్‌లో చూపడంతో 32 మందికి తల్లికి వందనం కోల్పోయారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్‌ను రైతులు కలిసి న్యాయం చేయాలని కోరామన్నారు. ఒకే సర్వేనంబర్‌లో 30 మంది రైతులు ఉండడంతో పాటు భూములు సబ్‌డివిజన్ కాకపోవడంతో ఒక్కో రైతుకు 44 ఎకరాలు ఉన్నట్లు వెబ్‌ల్యాండ్‌లో చూపుతున్న రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



లేని కారు ఉందని చెబుతున్నారు


నాకు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పెద్ద అమ్మాయి ముర్షిద్ అల్‌మాస్ గోరంట్లలోని దేవరాయ స్కూల్లో రెండో తరగతి, రెండో అమ్మాయి ఫైరోజ్‌అల్‌మాస్ ఒకటో తరగతి చదువుతున్నారు. నాకు రేషన్ కార్డు కూడా ఉంది. అయితే 2005వ సంవత్సరంలో నాలుగు చక్రాల వాహనం ఉండేది. అది పనికి రాకుండా పోవడంతో 2015లో గుజరి వ్యాపారులకు అమ్మేశా. ప్రస్తుతం నాలుగు చక్రాల వాహనం ఉందని కొర్రి వేసి నా పిల్లకు తల్లికి వందనం పథకం రాకుండా చేశారు. నేను పక్క తెలుగు దేశం పార్టీకి చెందిన వ్యక్తిని, నాకు తెలుగు దేశం పార్టీ సభ్యత్వం సైతం ఉందని, పార్టీ కోసం కష్టపడినా ఫలితం లేదన్నారు.

– అబ్దుల్‌సత్తర్, గోరంట్ల

అప్పడిచ్చారు.. ఇప్పడెందుకు ఇవ్వరు?


మా కుమార్తై 6వ తరగతి చదువుతోంది. మాకు సొంత ఇల్లు ఉంది. కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిందని సాకుగా చూపి తల్లికి వందనం పథకాన్ని రాకుండా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మా కుమార్తై పేరిట మాకు మూడుసార్లు అమ్మఒడి వర్తించింది. ఆ డబ్బుతోనే పాపను ఏ ఇబ్బంది లేకుండా చదివించాము. ఇప్పుడు ఇవ్వమంటున్నారు. ఏవేవో నిబంధనలు పేరిట చాలామందికి పథకం వర్తింపజేయకపోవడం చాలా అన్యాయం.

– సిగ్బత్, ముక్కిడిపేట, హిందూపురం

అర్హత ఉన్నా డబ్బులు పడలేదు


నేను పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. తల్లికి వందనం పథకం జాబితాలో అర్హత సాధించాను. అయినా ఇంత వరకూ మా అమ్మ బ్యాంకు ఖాతాలో ఈపథకం కింద రూ.13 వేలు పడలేదు. నా తమ్ముడు రంజిత్‌కు మాత్రం నిధులు జమ అయ్యాయి. అర్హత ఉన్నా నిధులు జమ ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే నిధులు జమ చేసి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– మౌనిక, 8వ తరగతి, మడకశిర

మా ఆశలపై నీళ్లు చల్లారు


నా కూతురు మేఘన ఇంటర్, కొడుకు అభినయ్ 9వ తరగతి చదువుతున్నారు. నా భర్త అనారోగ్యంతో మంచం పట్టాడు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నా. మాకు ఎకరంలోపే భూమి ఉంది. అయినప్పటికీ ఉమ్మడి ఆస్తి కావడంతో పది ఎకరాలు పైబడి భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దీంతో తల్లికి వందనం పథకం వర్తించలేదని అధికారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడు సార్లు అమ్మఒడి డబ్బులు జమ అయ్యాయి. ఈ యేడు తల్లికి వందనం పథకం వస్తుందని, పిల్లల చదువులకు ఆసరాగా మారుతుందని అనుకొన్నా. మా ఆశలకు కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది.

– చంద్రకళ, శెట్టిపల్లి గ్రామం, పెనుకొండ

ప్రతి ఒక్కరికీ పథకం వర్తింపజేయాలి


తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు స్కూలుకు వెళ్లే ప్రతి ఒక్కరికీ ఇస్తామని కూటమి నాయకులు హామీలు గుప్పించారు. అయితే ఇప్పుడు నిబంధనల పేరుతో సగం మందికి పథకం రాకుండా చేశారు. రెవెన్యూ, ఇతర సమస్యల పేరుతో ఎక్కువ శాతం మంది తల్లులకు పథకం వర్తించలేదు. వెంటనే నిబంధనలను పక్కన పెట్టి చెప్పిన విధంగా స్కూల్‌కు వెళ్లే ప్రతి ఒక్కరికీ నిధులు జమ అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చూడాలి. చేతకానప్పుడు తప్పుడు వాగ్దానాలు ఎందుకు ఇచ్చారు?

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

నిబంధనలతో మోసం


తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. ఇప్పుడు ఎన్నో షరతులు విధించి ఎంతో మంది తల్లులను మోసం చేశారు. అలాగే రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.13 వేలు మాత్రమే తల్లుల అకౌంట్లలోకి వేయడం సరికాదు. చిరుద్యోగులకు కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉంటుంది. అలాంటి వారికి పథకాన్ని రాకుండా చేశారు. ఇప్పటికీ చాలా మంది తల్లుల ఖాతాలకు నగదు జమ కాలేదు. ప్రతి ఒక్క విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు జరిగేలా చూడాలి.

– టీఎస్ దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, హిందూపురం

తల్లుల ఉసురు తగలడం ఖాయం


నిబంధనల పేరుతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం నిధులు జమ చేయకుండా కోత విధించింది. కూటమి ప్రభుత్వ తీరుతో ఎంతో మంది తల్లులకు అన్యాయం జరిగింది. ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న ప్రతి విద్యార్థికి ఈపథకం కింద రూ.15 వేలు అందిస్తామని చెప్పి చివరకు కూటమి ప్రభుత్వం వంచనకు గురిచేసింది. సగానికి సగం మందిని అనర్హులు ప్రకటించి పథకానికి దూరం చేశారు. మోసపోయిన తల్లులు, విద్యార్థుల ఉసురు కూటమి ప్రభుత్వానికి తగలడం ఖాయం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర


పూర్వ విద్యార్థులందరూ కలిసిన దృశ్యం

అ'పూర్వ' సమ్మేళనం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో 1986–1987లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరిని, ఆట, పాటలను, మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తులను, కుటుంబ సభ్యుల వివరాలను, యోగక్షేమాల గురించి మాట్లాడుకున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన ఎంతో వివిధ ఉన్నతస్థానాల్లో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఈ బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌ను సన్మానించారు. అనంతరం పట్టణంలోని రూప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, సైంటిస్ట్ శ్రీనివాసులు, నరసింహులు, ఉల్కలప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

అమరాపురం: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా నగోనపల్లి శివకుమార్, ఉపాధ్యక్షుడిగా మంజునాథ, గౌరవాధ్యక్షుడిగా దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా ముద్దరాజు, సలహాదారుగా నరసింహమూర్తి, నవీన్ నాగరాజు, కార్యదర్శులుగా రాజేష్, సురేష్, కోశాధికారిగా నాగరాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

'గురుపౌర్ణమి' పోస్టర్లు విడుదల

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో జూలై 8 నుంచి 10వ తేదీ వరకూ మూడురోజుల పాటు కైవరం తాతయ్య ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ తెలియజేశారు. కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. గురుపౌర్ణమి వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో అశ్వర్థ నారాయణ, రాజప్ప, సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న భక్త బృందం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండల వ్యాప్తంగా సమస్యలు ఉన్న వివిధ గ్రామాల ప్రజలు అర్జీల రూపంలో అర్జీలను సమర్పించుకోవాలన్నారు. మండలస్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

కూలీల యోగాసనం


యోగాసనాలు వేస్తున్న కూలీలు

పావగడ: తాలూకాలోని సీకే పురం గ్రామంలో కాయక మిత్ర గిరిజమ్మ ఆధ్వర్యంలో ఆదివారం యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే నరేగా కార్మికులు వివిధ ఆసనాలు వేశారు.

పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

మడకశిర: నియోజకవర్గ కేంద్రం నుంచి అరుణాచలం , స్వర్ణ దేవాలయం, కాణిపాకం పుణ్య క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం రంగభాష్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు మడకశిర నుంచి బయలుదేరుతుందన్నారు. పెద్ద వారికి రానుపోను రూ.1,450, పిల్లలకు రూ.750 చొప్పున టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు బుక్ చేసుకునేందుకు 7382862783, 7382862791, 9959229965 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు


అలంకరణలో స్వామివారు

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ట


అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని దిన్నేపాలెం సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకే గతంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, తాజాగా విగ్రహాన్ని పునఃప్రతిష్టించామని గ్రామస్తులు తెలిపారు.

హోంగార్డుకు గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెనుకొండ వైపు ద్విచక్ర వాహనంలో హోంగార్డు బ్రహ్మానందరెడ్డి తన కుమార్తైతో పాటు వెళుతుండగా కారు ఢీ కొంది. ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అదే కారు చెట్టుకు ఢీ కొని ఆగిపోయింది. మద్యం మత్తులో కారు నడపడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై అక్కడున్న వారు చేయి చేసుకున్నారు.

సమ్మె జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కార్మికుల పని గంటలను పెంచి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా జీఓలు తీసుకురావడం దారుణమన్నారు. నాయకులు రమేష్, కరణ్, మనీ, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.